# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 339 మంగళవారం 13 ఆగస్టు 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

- హత్యాచార ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- రాష్ట్రాల్లో వైద్య సేవలకు అంతరాయం
- ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు డిమాండ్
- న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం



## 1.3 లక్షల మంది టెకీలపై వేటు!



- ఈ ఏడాది ఇప్పటి వరకు ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య ఇది
- ఐటీ రంగంలో ఆగని తొలగింపులు
- గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఈ లేఆఫ్‌ల ట్రెండ్ ఇప్పట్లో నెమ్మదించేలా కనిపించడం లేదు.
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 397 కంపెనీల్లో 1,30,482 మంది ఉద్యోగాలు పోయాయి
- మరోవైపు పలు కంపెనీలు ఉద్యోగాల కోత బాటలో నడుస్తున్నాయి.





## సెబీ చీఫ్‌పై మరిన్ని ఆరోపణలు

- బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయని ఆమె బహిరంగంగా ఒప్పుకొన్నారు
- తన కన్సల్టింగ్ సంస్థల క్లయింట్ల వివరాలు వెల్లడించాలి
- మాధవి పురీ బచ్‌పై హిండెన్‌బర్గ్ మళ్లీ ఆరోపణలు

# పెట్టుబడులకు కొరియా సిద్ధం

- టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలత ఆ దేశ పారిశ్రామికవేత్తలతో
- సీఎం రేవంత్ సమావేశంతెలంగాణలో హ్యుందయ్
- మెగా టెస్టింగ్ సెంటర్ విద్యుత్తు, గ్యాస్, బ్యాటరీల
- తయారీలో ఎల్ఎస్ కార్పొరేషన్.. అంతర్జాతీయ స్థాయిలో
- మౌలిక వసతులు సమకూర్చాం
- అన్నివిధాలా సహకరిస్తాం మా రాష్ట్రానికి రండి
- ప్రతినిధులతో సమావేశాల్లో ముఖ్యమంత్రి పిలుపు



హైదరాబాద్/వరంగల్

అమెరికా నుంచి తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలను ఆకర్షించడంలో విజయవంతమైన సీఎం రేవంత్‌రెడ్డి.. దక్షిణ కొరియాలోనూ దానిని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా.. పరిశ్రమలు రాని వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులను సాధించగలిగారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, - మిగతా3లో

## హర్ ఘర్ తిరంగా.. మనందరి బాధ్యత!

- ప్రతి ఒక్కరూ ఈ పండగలో ఉత్సాహంగా పాల్గొనాలి
- జాతీయ సమైక్యతను కాపాడటం మనందరి బాధ్యతన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- హైదరాబాద్ లోని తన నివాసంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన కిషన్ రెడ్డి దంపతులు



## విపత్తు దృశ్యాలపై తేదీ, సమయం ఉండాలి!

ప్రైవేటు టీవీ న్యూస్ చానళ్లకు కేంద్రం ఆదేశం

ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు టీవీ చానళ్లు రోజుల తరబడి నిరంతర కవరేజీ ఇస్తుంటాయి

అనవసర గందరగోళం, భయాందోళనలు కలిగే అవకాశం ఉంది



## తెలంగాణ పర్యటకానికి విస్తృత ప్రచారం



త్వరలో ఖమ్మం జిల్లాకు రోప్ వే

ఉప ముఖ్యమంత్రి భట్టి



## ఈ ఘటన భయానకమైనది

- సీఎం మమతా బెనర్జీకి ప్రియాంక గాంధీ విజ్ఞప్తి
- ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం
- పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది ఒక పెద్ద సమస్యగా మారింది
- దీనికి తీవ్రమైన కృషి చేయాల్సిన అవసరం ఉంది
- తద్వారా మృతురాలి కుటుంబానికి, వైద్య సిబ్బందికి న్యాయం జరుగుతుంది

# మరోసారి ఆకర్ష.. ఆకర్ష!

- కాంగ్రెస్‌లోకి జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేలు
- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి రాగానే చేరికలు
- బీజేపీతో బీఆర్ఎస్ నేతలు టచ్‌లోకి వెళ్లారన్న ప్రచారంతో అప్రమత్తం
- కొందరు నాయకులకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చే అవకాశం

హైదరాబాద్

బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారన్న వార్తల నేపథ్యంలో ఆపరేషన్ ఆకర్ష్‌కు సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి పదును పెట్టనున్నారా? జీహెచ్ఎంసీ పరిధిలోని అరడజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెసలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారా? ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న సీఎం.. హైదరాబాద్‌కు తిరిగి రాగానే మరో - మిగతా3లో



## 8 నెలల్లోనే ఎందుకీ వ్యవసాయ విధ్వంసం?

- తగ్గిన సాగు రైతుకు ప్రమాద సంకేతం
- కాంగ్రెస్ పాలనలో రైతుకు భరోసా లేదు
- అస్తవ్యస్థ విధానాలతోనే దయనీయ స్థితి
- సాగు విస్తీర్ణం తగ్గడంపై కేటీఆర్ ఆందోళన



# ఈ ఘటన భయానకమైనది

**న్యూఢిల్లీ :** కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఘటన భయానకమైనదన్నారు. అలాగే హృదయవిదారకమైన సంఘటనగా ఆమె అభివర్ణించారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి.. నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా మమతా ప్రభుత్వానికి ప్రియాంక గాంధీ విజ్ఞప్తి చేశారు. తద్వారా మృతురాలి కుటుంబానికి, వైద్య సిబ్బందికి న్యాయం జరుగుతుందని ఆమె ఆకాంక్షించారు. పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనికి తీవ్రమైన కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు.

**వెల్లువెత్తిన విమర్శలు..**

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఈ ఆసుపత్రిలో ఈ తరహా ఘటన చోటు చేసుకోవడంతో.. సర్వత్ర విమర్శలు అయితే వెల్లువెత్తుతున్నాయి. ఆ క్రమంలో దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విధితమే. సంచలనం రేపిన ఈ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని ఇప్పటికే బీజేపీ డిమాండ్ చేస్తుంది. దీనికి



బెంగాల్‌లోని వామపక్ష పార్టీలు సైతం గొంతు కలిపాయి.

**అత్యాచార రాజధానిగా..**

మరోవైపు ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు భాగస్వామ్యులుగా ఉన్నాయి. అలాంటి వేళ ఈ ఘటనపై సమ్మెకు దిగిన వైద్య సిబ్బందికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. అంతేకాదు.. సమ్మెలో సైతం ఆ పార్టీ శ్రేణులు పాల్గొనడం విశేషం. బెంగాల్‌లో శాంతి భద్రతల పరిస్థితి క్షీణించాయనేందుకు ఈ ఘటన సూచిస్తుందని ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధిర్ రంజిన్ చౌదరి స్పష్టం చేశారు. గత కొద్ది కాలంగా పశ్చిమ బెంగాల్ ప్రతిష్ట మసకబారిందన్నారు. ఆ క్రమంలో కోల్‌కతా అత్యాచార రాజధానిగా మారిందన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసు సీబీఐకి అప్పగించలన్నారు.

**బాధిత కుటుంబానికి సీఎం పరామర్శ...**

ఈ రోజు బాధిత కుటుంబాన్ని సీఎం మమతా బెనర్జీ పరామర్శించనున్నారు. అదీకాక ఈ కేసును ఆదివారం లోపు ఛేదించాలని బెంగాల్ పోలీసులకు సీఎం మమతా బెనర్జీ అల్టిమేటం జారీ చేశారు. అలా కాకుంటే సీబీఐ దర్యాప్తునకు తమ ప్రభుత్వం సిఫార్స్ చేస్తుందని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసే అవకాశముంది.

**నిందితుడు ఒక్కడు కాదు...**

శుక్రవారం తెల్లవారుజామున ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైనీ వైద్యురాలపై హత్యాచారం చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో మరింత మంది నిందితులు ఉన్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వైద్యులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం ఆరోపిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

**కోల్‌కతా/న్యూఢిల్లీ, :** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు సోమవారం ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో పలు రాష్ట్రాల్లోని దవాఖానల్లో పలు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్, ఆర్‌ఎంఎల్ ఇతర ప్రభుత్వ దవాఖానల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణతో పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా దవాఖానల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. తమ సహచర వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి చేత నిష్పాక్షిక




దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితురాలి పోస్టుమార్టం నివేదికతోపాటు హత్యాచారం జరిగిన మెడికల్ కాలేజీ సెమినార్ హాల్ సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని దవాఖానల్లో వైద్యుల భద్రతకు కేంద్రం ప్రొటోకాల్ విడుదల చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.

**ఆదివారానికి పరిష్కరించకుంటే సీబీఐకి**

వచ్చే ఆదివారం నాటికి పోలీసులు కేసును పరిష్కరించలేకుంటే కేసును సీబీఐకి బదిలీ చేస్తామని సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. సోమవారం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులకు మరణశిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా, బాధితురాలు ఆత్మహత్య చేసుకుని మరణించిందని తొలుత దవాఖాన అసిస్టెంట్ సూపరింటెండెంట్ బాధితురాలి కుటుంబానికి ఫోన్ చేసి తెలిపినట్టు తెలిసింది. దీంతో అతడిని పోలీసులు విచారణకు పిలిచారు.

**నీకు కూడా అలాగే జరుగుతుంది..**

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌కు ఏం జరిగిందో నీకూ అదే జరుగుతుందని శుక్రవారం రాత్రి బెంగాల్‌లోని పుర్బ బర్ధమాన్ జిల్లాలో ఓ పౌర వలంటీర్ ఓ ప్రభుత్వ దవాఖాన వైద్యురాలిని బెదిరించడం సంచలనంగా మారింది.

# సెబీ చీఫ్‌పై మరిన్ని ఆరోపణలు

**న్యూఢిల్లీ :** తమ ఆరోపణలు ఖండిస్తూ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురీ బచ్, ఆమె భర్త ధావన్ చేసిన సంయుక్త ప్రకటన పలు కొత్త సంక్లిష్ట ప్రశ్నలు లేవనెత్తుతున్నదని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. మాధవి బచ్ స్పందన ద్వారా అనామక బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయన్న విషయాన్ని బహిరంగంగా ధ్రువీకరిస్తున్నారని పేర్కొన్నది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని, సెబీ విశ్వసనీయతను దెబ్బతీయడంతోపాటు వ్యక్తిత్వ హననానికి ప్రయత్నిస్తున్నట్టు ఉన్నాయని సెబీ చీఫ్ మాధవి బచ్ ఆదివారం ప్రకటన విడుదల చేసిన కొద్ది గంటల తర్వాతనే హిండెన్‌బర్గ్ ఎక్స్‌లో వరుసగా పలు పోస్టులు పెట్టింది. వారి స్పందనలో పలు ముఖ్యమైన అంగీకారాలు ఉండటంతోపాటు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని పేర్కొన్నది. బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులను తన భర్త చిన్ననాటి స్నేహితుడు నడుపుతున్నాడని ఆమె ధ్రువీకరించారని, ఆయన ఆ సమయంలో అదానీ గ్రూపు లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారని వెల్లడించింది. భారత్‌తో పాటు సింగపూర్‌లోని ఆమె కన్సల్టింగ్ సంస్థలు డీల్ చేస్తున్న క్లయింట్ల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. 2024, మార్చి 31 నాటికి తాజా షేర్ హోల్డింగ్ లిస్టు ప్రకారం 2017లో తాను సెబీ సభ్యురాలిగా అయిన తర్వాత తన భర్త 2019లో టేకోవర్ చేసిన అగోరా అడ్వైజరీ




లిమిటెడ్(ఇండియా)లో 99% మాధవి బచ్ పేరుపైనే ఉన్నాయని, ప్రస్తుతం ఈ సంస్థ యాక్టివ్‌గానే ఉన్నదని, లక్షల రూపాయల మేర కన్సల్టింగ్ ఆదాయం పొందుతున్నదని హిండెన్‌బర్గ్ తెలిపింది. అగోరా పార్ట్నర్స్ సింగపూర్‌లో 2022, మార్చి 16 వరకు 100% షేర్ హోల్డర్‌గా ఆమె ఉన్నారని పేర్కొన్నది. సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెండు వారాల తర్వాతనే తన షేర్లను భర్త పేరుపై బదిలీ చేశారని వెల్లడించింది. సెబీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు మాధవి బచ్ తన భర్త పేరుపై ఏ ఇతర వ్యాపారాల్లో ఉన్నారనే ప్రశ్నలు వస్తున్నాయని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది.

**జేపీసీ వేయకుంటే దేశవ్యాప్త ఆందోళనలు**

సెబీ చీఫ్‌పై ఆరోపణలు తీవ్రమైన అంశమని, జేపీసీ దర్యాప్తునకు కేంద్రం అంగీకరించకుంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరించారు. అదానీ గ్రూపునకు ప్రధాని మోదీ సహకరిస్తున్నారని ఆరోపించారు. మోదీ సర్కార్ చెప్పే 'అమృత్‌కాల్'లో ఏ సంస్థ కూడా పవిత్రంగా లేకుండా పోయిందని జైరాం రమేశ్ విమర్శించారు. అదానీ గ్రూపు ఆర్థిక అవకతవలపై దర్యాప్తు విషయంలో సెబీ రాజీపడినట్టు కనిపిస్తున్న క్రమంలో దర్యాప్తును సీబీఐ లేదా సిట్‌కు అప్పగించాలన్నారు. సెబీ సమగ్రతను పునరుద్ధరించేందుకు చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చే యత్నాలు**

జేపీసీ వేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తిరస్కరించారు. భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడాలని, స్టాక్ మార్కెట్ పడిపోవాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని ఆరోపించారు. పెద్ద కుట్రలోనే భాగంగా హిండెన్‌బర్గ్ ఆరోపణలు, విపక్షాలు విమర్శలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, మోదీ సర్కార్‌ను అస్థిరపరిచే ప్రయత్నాల వెనుక హిండెన్‌బర్గ్‌లో ఇన్వెస్టర్‌గా ఉన్న బిలియనీర్ జార్జి సోరోస్ ఉన్నారని ఆరోపించారు.

# 1.3 లక్షల మంది టెకీలపై వేటు!

**న్యూఢిల్లీ :** టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగుల తొలగింపుల పర్వం కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,30,000 మందికి పైగా ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఈ లేఆఫ్‌ల ట్రెండ్ ఇప్పట్లో నెమ్మదించేలా కనిపించడం లేదు. ఆర్థికపరమైన సవాళ్లు, పోటీ ఒత్తిళ్లతో పాటు కొత్త మార్కెట్ మార్పులను అనుసరించాల్సి రావడం వంటివి ఉద్యోగుల తొలగింపునకు ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. లేఆఫ్స్. ఎఫ్‌వైఐ డాటా ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 397 కంపెనీల్లో 1,30,482 మంది ఉద్యోగాలు పోయాయి. మరోవైపు పలు కంపెనీలు ఉద్యోగాల కోత బాటలో నడుస్తున్నాయి. మరో రౌండ్ లేఆఫ్‌లకు సిస్కో కంపెనీ సిద్ధమవుతున్నట్టు నివేదికలు వస్తున్నాయి. ఈ ఏడాది మొదట్లో చేపట్టిన 4 వేల ఉద్యోగాల కంటే ఈ దఫా అధికంగా కోతలు ఉండే అవకాశం ఉన్నదని రాయిటర్స్ నివేదించింది. సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి అధిక వృద్ధి ఉండే రంగాలపై దృష్టి సారించే వ్యూహంలో భాగంగా సిస్కో ఈ చర్య చేపడుతున్నట్టు




తెలిసింది. జూలైలో ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకొనే ప్లాన్‌ను చిప్ తయారీ సంస్థ ఇంటెల్ ప్రకటించింది. 2025 నాటికి కంపెనీ స్థిరత్వం సాధించేందుకు వ్యయ తగ్గింపులో భాగంగా ప్రస్తుతం కంపెనీలో ఉన్న శ్రామిక శక్తిలో 15 శాతానికి పైగా అంటే 15,000 మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపే యోచనలో ఉన్నట్టు సమాచారం.

**భారతీయ కంపెనీల్లోనూ..**

మైక్రోసాఫ్ట్‌లో గత రెండు నెలల కాలంలో నిశ్శబ్దంగా దాదాపు వెయ్యి మందిని తొలగించినట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అన్‌అకాడమీ, వేకూల్ వంటి భారత కంపెనీలు లేఫ్‌ల బాటలో పయనిస్తున్నాయి. ఉద్యోగుల తగ్గింపునకు సంబంధించి ఆయా సంస్థలు ఇప్పటికే ప్రకటనలు చేశాయి. అన్‌అకాడమీ 250 మందిని, వేకూల్ 200 మందిని తొలగించనున్నట్టు ప్రకటించాయి. మరోవైపు ఐటీ ఇండస్ట్రీతో పాటు ఇతర రంగాల్లోనూ ఈ ట్రెండ్ కొనసాగుతున్నది. భారత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో దాదాపు 42,000 ఉద్యోగులకు ఉద్వాసన పలికారు.

## దేశంలో ఆర్థిక అరాచకాన్ని ప్రేరేపిస్తున్న రాహుల్ గాంధీ : రవిశంకర్ ప్రసాద్

హిండెన్‌బర్గ్ లేటెస్ట్ రిపోర్ట్‌పై కాషాయ పాలకులే లక్ష్యంగా విమర్శల దాడి చేపట్టిన కాంగ్రెస్ తీరును బీజేపీ ఎండగట్టింది. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ భారత స్టాక్ మార్కెట్ల సమగ్రతను ప్రశ్నిస్తూ దేశంలో ఆర్థిక అరాచకాన్ని ప్రేరేపిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ హిండెన్‌బర్గ్ నివేదిక శనివారం వచ్చిందని, ఆదివారం దీనిపై గందరగోళం చెలరేగితే సోమవారం క్యాపిటల్ మార్కెట్‌లో అస్థిరత నెలకొంటుందని వ్యాఖ్యానించారు. అదానీ విదేశ ఫండ్లలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ ఆమె భర్తకు వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో వెల్లడించడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నివేదికలో ఆరోపణలు నిరాధారమైనవని మాధవి పురి బుచ్ తోసిపుచ్చారు. అయితే ఈ వ్యవహారంపై కేంద్రాన్ని నిలదీసిన విపక్షాలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తునకు డిమాండ్ చేశాయి. ఇక ఈ నివేదిక వెల్లడించిన సమయాన్ని పరిశీలిస్తే ఏదో జరుగుతున్నదని అర్థమవుతుందని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. జులైలో సెబీ నుంచి హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసు జారీ అయింది. ఈ నోటీసుకు బదులివ్వాల్సింది పోయి హిండెన్‌బర్గ్ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. దీనిపై సెబీ, సెబీ చీఫ్ స్పందించారని తెలిపారు. హిండెన్‌బర్గ్‌లో అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్ కీలక ఇన్వెస్టర్ కావడంతో ఇందులో భారీ కుట్రకు తెరలేపారనే అనుమానాలున్నాయని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ విపరీతమైన ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని ఆయన అన్నారు.

## రాక్షసి పీడ వదిలింది

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌కు పట్టిన రాక్షసి పీడా వదిలిందని కొన్ని రోజుల క్రితం దేశం వదిలి పారిపోయిన గత ప్రభుత్వాధినేత హసీనాను అభివర్ణిస్తూ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనుస్ అన్నారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని తాను గౌరవిస్తున్నానని, వారు చెప్పినందువల్లే తాను ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా తాను సారథ్యం వహిస్తున్న తాత్కాలిక ప్రభుత్వం పనిచేస్తుందని యూనుస్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ యూనుసకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడ నివసిస్తున్న హిందువులు, ఇతర మైనారిటీల భద్రతకు ఢోకా లేకుండా చూడాలని కోరారు. బంగ్లాదేశ్ అభివృద్ధికి భారత్ అన్ని రకాలుగా సహకరిస్తుందని మోదీ హామీ ఇచ్చారు.



## ఓఎస్‌లో లోపాలు గుర్తిస్తే మిలియన్ డాలర్లు

**ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్**

**న్యూఢిల్లీ:** ఎవరికీ అన్యాయం చేయకుండా మిలియనీర్ కావాలనుకుంటున్నారా? ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ సరికొత్త బౌంటీ ఆఫర్ మీ కోసమే. మీరు చేయాల్సిందల్లా దాని ఆపరేటింగ్ సిస్టం (ఓఎస్)లోని అతిపెద్ద సమస్యను కనిపెట్టడమే. ఈ పనిని విజయవంతంగా చేస్తే మిలియన్ డాలర్లు మీ సొంతమవుతాయి. మొబైల్ సెక్యూరిటీ ప్రోగ్రాంలో భాగంగా శాంసంగ్ ఈ ఆఫర్‌ను ప్రకటించింది. డేటాను వెలికి తీయడం, పరికరాలను అన్‌లాక్ చేయడం, అనధికారిక అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి భద్రతాపరమైన లోపాలతోపాటు ఓఎస్ దుర్భలత్వానికి సంబంధించిన సమస్యలను గుర్తించిన వారికి ఈ రివార్డు ఇవ్వనున్నట్టు శాంసంగ్ తెలిపింది. కనిపెట్టిన లోపం తీవ్రత ఆధారంగా రివార్డు ఉంటుంది. శాంసంగ్ హార్ట్‌వేర్ సెక్యూరిటీ సిస్టంలోని సరికొత్త నాక్స్ వాల్ట్ విజయవంతంగా హ్యాక్ చేయడం, రిమోట్ కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం ద్వారా టాప్ ప్రైజ్ అయిన మిలియన్ డాలర్లు సొంతం చేసుకోవచ్చు. అలాగే, అన్‌లాక్ చేయడం, డేటాను దొంగిలించడం, గెలాక్సీ స్టోర్ నుంచి కాకుండా ఇతర సోర్సుల నుంచి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వంటి వాటికి కూడా అవార్డులు ప్రకటించింది.




## విపత్తు దృశ్యాలపై తేదీ, సమయం ఉండాలి!

న్యూఢిల్లీ ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాల దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు వాటిపై తేదీ, సమయానికి సంబంధించిన స్టాంపు ప్రసారమయ్యేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు టీవీ న్యూస్ చానళ్లను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసార శాఖ సోమవారం ఒక సూచన జారీ చేసింది. ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు టీవీ చానళ్లు రోజుల తరబడి నిరంతర కవరేజీ ఇస్తుంటాయని, అయితే, తొలిరోజు దృశ్యాలను ఫుటేజ్‌లో చూపిస్తూనే ఉండటం వల్ల వీక్షకులకు అనవసర గందరగోళం, భయాందోళనలు కలిగే అవకాశం ఉందని తెలిపింది. 'అందువల్ల వీక్షకులను అనవసరపు అపార్థాలకు గురిచేయకుండా నివారించేందుకు అలాంటి దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు ఫుటేజీ పైభాగంలో తేదీ, సమయం స్టాంపును ప్రముఖంగా ప్రదర్శించాలని అన్ని ప్రైవేటు శాటిలైట్ టీవీ చానళ్లకు సూచిస్తున్నాం' అని స్పష్టం చేసింది. ఈ సూచన పాటించడం వల్ల వాస్తవంగా ఏరోజు దృశ్యాలను ప్రసారం చేస్తున్నారో వీక్షకులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపింది. కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఇటీవల కొండచరియలు విరిగిపడి అనేకమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలను టీవీ చానళ్లు విస్తృతంగా ప్రసారం చేసిన నేపథ్యంలో కేంద్రం నుంచి తాజా సూచన వెలువడింది.




## అసెంబ్లీ ఎన్నికల నగారా.. హర్యానాలో ఈసీ పర్యటన

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహకాలను సమీక్షించేందుకు ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్రంలో పర్యటిస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలోని ఈసీఐ బృందం సోమవారంనాడు చండీగఢ్ చేరుకుంది. రాజీవ్ కుమార్ వెంట ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ ఎస్ఎస్ సంధు కూడా ఉన్నారు. కాగా, 90 మంది సభ్యుల హర్యానా అసెంబ్లీ గడువు ఈ ఏడాది నవంబర్ 3వ తేదీతో ముగియనుంది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన 8 రాష్ట్రాల్లో హర్యానా ఒకటి. ఈసారి హర్యానా ఎన్నికల బరిలో ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డి), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) కలిసి పోటీ చేస్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ సొంతంగానే 90 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించింది.



గత ఫలితాలివే..

2019 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 31 సీట్లు, జేజేపీ 10 సీట్లు, ఐఎన్ఎల్‌డీ ఒక సీటు గెలుచుకున్నాయి. కాగా, ఈసారి అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ లోగా జరిగే అవకాశాలున్నాయి. అయితే ఎన్నికల తేదీలను ఇంకా

# మరోసారి ఆకర్ష.. ఆకర్ష!

-మొదటిపేజీ తరువాయి

విడత చేరికలుంటాయా? అంటే.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. వాస్తవానికి సీపీఐ ఎమ్మెల్యేతో కలిపి 65 మంది సభ్యుల మద్దతుతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కాలం నిలవబోదంటూ కేసీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్య నేతలు చేసిన ప్రకటనలతో అప్రమత్తమైన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసిన సంగతి తెలిసిందే.

ఇందులో భాగంగానే దానం నాగేందర్ మొదలుకుని పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దశల వారీగా కాంగ్రెసలో చేరారు. గతంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకం గా శాసనసభా పక్షం ఏర్పాటు చేయించి బీఆర్ఎసఎల్పీలో విలీనం చేయించుకున్న తీరుగానే.. బీఆర్ఎసకు చెందిన 26మంది ఎమ్మెల్యేలతో శాసనసభా పక్షాన్ని ఏర్పాటు చేయించి సీఎల్పీలో విలీనం చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళిక రచించారన్న ప్రచారం జరిగింది. బడ్జెట్ సమావేశాలకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలనుకున్న సీఎం రేవంత్‌రెడ్డి .. ఆ దిశగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులూ జరిపారు. కొంత మందితో ముఖాముఖి సమావేశమై హామీలూ ఇచ్చారు. కాంగ్రెసకు ప్రాతినిధ్యం లేని గ్రేటర్ హైదరాబాద్, శివారు నియోజకవర్గాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాషగౌడ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెసలో చేరారు. వీరితోపాటు గ్రేటర్ పరిధిలోని మరో అరడజను మంది ఎమ్మెల్యేల చేరికకూ అంతా సిద్ధమైనా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రక్రియకు విరామం ఇచ్చారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, పాలనాపరమైన నిర్ణయాలను బడ్జెట్ సమావేశాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించి.. చేరికలను పెండింగ్‌లో పెట్టారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే పెట్టుబడులను ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు వెళ్లారు. అయితే, బీజేపీ పెద్దలతో బీఆర్ఎస్ ముఖ్యనాయకులు సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారం జోరందుకోవడంతో ఆపరేషన్ ఆకర్ష్‌కు మరోమారు పదును పెట్టాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న ఆయన.. హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక.. చేరికల ప్రక్రియ పునఃప్రారంభమవుతుందని, గ్రేటర్ పరిధిలోని అరడజను మంది ఎమ్మెల్యేలూ చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### ఇస్తే.. కార్పొరేషన్ చైర్మన్ పోస్టులే

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలో చేరే ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వబోమంటూ సీఎం రేవంత్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే కీలక కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి మంత్రి పదవి ఇస్తామంటే.. తమతోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలనూ తీసుకువచ్చేందుకు ఒకరిద్దరు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కానీ, విధాన పరంగా పార్టీ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వారికి మంత్రి పదవులు దక్కే అవకాశం లేదని పేర్కొంటున్నాయి. అయితే, పార్టీలో చేరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఉత్సాహం నింపేందుకు కీలకమైన కార్పొరేషన్ పదవులు ఆఫర్ చేసే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 15 తర్వాత టీపీసీసీ కార్యవర్గం, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ సందర్భంలోనే కాంగ్రెసలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చే అంశంపైనా అధిష్ఠానంతో ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది

# పెట్టుబడులకు కొరియా సిద్ధం..

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాలను అక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం వివరించారు. దీంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధమని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులు తెలిపారు. అమెరికా పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు బృందం శనివారం కొరియాకు చేరుకున్నారు. అక్కడ పలు కంపెనీలు, వివిధ వ్యాపార, వాణిజ్య సముదాయాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ చైర్మన్ కియాక్ సంగ్, వైస్‌చైర్మన్ సొయాంగ్ జూ సహా 25 అగ్ర శ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగ విస్తృతికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ.. స్థానిక కంపెనీలతోపాటు ప్రపంచ స్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కు సహా తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని వివరించారు. బయటి దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే కంపెనీలకు ఏ ఇబ్బంది లేకుండా అన్ని రకాల అనుమతును వేగంగా పూర్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.



### హ్యుందయ్ మెగా టెస్టింగ్ సెంటర్..

మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన హ్యుందయ్ కొరియాకు చెందిన దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీ హ్యుందయ్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. భారత్‌లోని హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ (హెచ్ఎంఐఈ) ద్వారా ఒక మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు పెడతామని ఆ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి తెలిపారు. సియోల్‌లో సోమవారం ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల నుంచి తమ ప్రభుత్వం పెట్టుబడులను ఆహ్వానిస్తోందని తెలిపారు. దీనికి అనుగుణంగానే తాము అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను సమకూర్చామని, పరిశ్రమల పెట్టుబడులకు అనుకూలమైన పాలసీలు రూపొందించామని చెప్పారు. అనుమతుల విషయంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. తెలంగాణ లో అంతర్జాతీయ ప్రమాణాలతో కార్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హ్యుందయ్ కంపెనీ ముందకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ఇతర చిన్న కంపెనీలు, చిన్న తరహా పరిశ్రమలు విస్తరించే అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు సమకూరుతాయన్నారు. అంతేకాకుండా దక్షిణాసియా పసిఫిక్ ప్రాంతంలో పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. కాగా, తమ కంపెనీ పెట్టుబడులను విస్తరించేందుకు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌కు హ్యుందయ్ కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. భారత్ తమకు ఎంతో కీలకమైన మార్కెట్ అని చెప్పారు.

తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న చొరవ ఎంతో ప్రగతిశీలంగా ఉందని, రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వారు అన్నారు. విద్యుత్తు, గ్యాస్, బ్యాటరీల రంగంలో ఎల్ఎస్ పెట్టుబడులు..కొరియాలో అతిపెద్ద పరిశ్రమల గ్రూపు ఎల్ఎస్ కార్పొరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సీఎం రేవంత్ ఎక్స్‌లో వెల్లడించారు. కార్పొరేషన్ చైర్మన్ కు జా ఉన్‌తో జరిగిన చర్చల్లో.. తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుళ్లు, గ్యాస్, విద్యుత్తు, బ్యాటరీల రంగంలో తయారీ యూనిట్లు నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు. తన ఆహ్వానం మేరకు ఎల్ఎస్ కార్పొరేషన్ బృందం త్వరలో రాష్ట్ర పర్యటనకు వచ్చేందుకు అంగీకారం తెలిపారని వెల్లడించారు.

### యువత రాణించేలా కార్యాచరణ: సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని యువతకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. యువత సన్మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. తెలంగాణ యువత రాణించేలా ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్యాచరణ రూపొందించిందని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ, స్కిల్ వర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### వస్త్ర నగరికి కలిసి వచ్చేనా..?

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రూ.1,350 కోట్ల వ్యయంతో 1,150 ఎకరాల్లో 200కు పైగా వస్త్ర కంపెనీలు, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా కేఎంటీపీ ద్వారా ఉపాధి కల్పించబోతున్నట్లు చెప్పింది. ఈ మేరకు 22 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నప్పటికీ ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే ఇక్కడ అడుగుపెట్టాయి. ఇందులో దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 2023లో గత ప్రభుత్వంతో యంగాన్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో జూన్ 29న వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణ కొరియాపై ఫోకస్ పెట్టిన సీఎం.. తన పర్యటనలో భాగంగా ఆ దేశాన్ని సందర్శించారు. ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీ, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీతో పాటు మరో 25అగ్రశ్రేణి కంపెనీలతో సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానించడంతో వరంగల్‌లో వస్త్రనగరి భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

# చైనా ఆలోచనలను రాహుల్ గాంధీ అమలు చేస్తున్నరు

కరీంనగర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చైనా ఆలోచనలను అమలు చేసే వ్యక్తి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. చైనా ఆదేశాలతోనే బంగ్లాదేశ్ ఘటనపై రాహుల్ గాంధీ నోరు విప్పడం లేదని విమర్శించారు. నెహ్రూ కుటుంబానికి రాజకీయ లబ్ది కోసం దేశ మహనీయుల త్యాగాలను కనుమరుగు చేసే కుట్ర చేస్తున్నారని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనను తెరమరుగు చేస్తున్నారని మండిపడ్డారు. స్వతంత్ర్య ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యంతోపాటు మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకు 'హర్ ఘర్ తిరంగా' పేరిట కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ నుండి భారీ ఎత్తున 'హర్ ఘర్ తిరంగా' యాత్రను ప్రారంభమైంది. బండి సంజయ్ ఈ యాత్రకు విచ్చేసి తెలంగాణ చౌక్ నుండి టవర్ సర్కిల్ వరకు నడిచారు. భారీ ఎత్తున తరలివచ్చిన యువకులు, విద్యార్థులు మువ్వెన్నెల జెండాను చేత పట్టుకుని మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ కదం తొక్కారు. బండి సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగారు.

అంతకుముందు బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నాం. ఇంటిపైన జాతీయ జెండాను ఎగరేయడం, సెమినార్లు నిర్వహించడం, దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పుష్పార్చన చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు రంగుల జాతీయ జెండా...మనందరి ఆత్మగౌరవ పతాకం. జెండా, ఎంజెడాలను పక్కనపెట్టి చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లపై మువ్వెన్నల జెండాను ఎగరేయండి. దేశభక్తుల ఫొటోలును పంద్రాగస్టు వరకు వాట్సప్ డీపీలుగా పెట్టుకోండి.

ఈ దేశాన్ని గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్. అట్లాగే ఎంతో మంది మహనీయులు దేశం కోసం బలిదానం చేశారు. కాంగ్రెస్ నేతలు మాత్రం నెహ్రూ కుటుంబానికి లబ్ది చేయడమే లక్ష్యంగా చరిత్రను తెరమరుగు చేసే యత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కాలని చూస్తోంది. అంబేద్కర్ ఆలోచనలు లేకుండా చేయాలని కుట్ర చేస్తోంది. కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజలను చీల్చే కుట్రలు చేస్తోంది. నెహ్రూ అరాచక, అనాలోచిత విధానాలవల్ల విభజన గాయాలు ఇంకా మనల్ని వెంటాడుతున్నాయి. ఆనాడు లక్షల మంది చనిపోయారు. కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు.

ఇవన్నీ గుర్తు చేయడంతోపాటు మహనీయులను స్మరించుకునేందుకు తిరంగా యాత్ర చేస్తున్నం. అంబేద్కర్ స్ఫూర్తితో మోదీ పాలనను కొనసాగిస్తున్నారు. 370 ఆర్టికల్ పేరుతో కాశ్మీర్ దేశంలో అంతర్భాగం కాకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తే... మోదీ 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్ భారత్ లో అంతర్భాగమని నిరూపించిన వ్యక్తి మోదీ.

## హర్ ఘర్ తిరంగా.. మనందరి బాధ్యత!



హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి కోరారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా.. హైదరాబాద్ లోని తమ నివాసంలో కిషన్ రెడ్డి దంపతులు జాతీయ జెండాను ఎగురవేశారు. మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా జరుగుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర్య పండుగ సందర్భంగా 23 కోట్ల మంది భారతీయులు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారని, రేపటి స్వాతంత్ర్య దినోత్సవం వరకు ఈ స్ఫూర్తిని కొనసాగించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు తిరంగా ర్యాలీలు నిర్వహించి.. ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు. దేశ సమైక్యతను కాపాడుకునే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాలుపంచుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. ఆగస్టు 9న దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగనుంది.

## తెలంగాణ పర్యటకానికి విస్తృత ప్రచారం



ఖమ్మం : ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖిల్లాను పరిశీలించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏడాది కాలంలోనే రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిని చూస్తారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఎన్ని నిధులైన కేటాయిస్తాం. తెలంగాణ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రపంచ పటంలో స్థానం కల్పిస్తాం.

ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలో మంత్రులు, ఎశ్రీజీ లను తీసుకొని పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం కల్పించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి నిర్ణయించడం అభినందనీయం అన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వారు మహబూబ్నగర్ జిల్లాలో కార్యక్రమం పూర్తిచేసుకుని ఖమ్మం జిల్లాలో ప్రారంభించారని వివరించారు. నెలకు ఒకసారి మంత్రులు ఎమ్మెల్యేలు ఆయా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో కుటుంబాలతో సహా బస చేయాలని మంత్రిగారు నిర్ణయించడం మంచి విషయం అన్నారు. ఖమ్మం జిల్లాలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. కిన్నెరసాని నుంచి భద్రాచలం వరకు అడవులు ఎకో టూరిజానికి అనువుగా ఉన్నాయని తెలిపారు. నేలకొండపల్లిలోని బౌద్ధ స్తూపం మొదలు జమలాపురం మీదుగా భద్రాచలంలోని సీతారాముల ఆలయం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖిల్లా కు రోప్ వే కావాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉందని తెలిపారు. రోప్ వే నిర్మాణానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుమతులు ఇస్తూ వెంటనే సంతకాలు చేశారని త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని వాటిని కొద్ది నెలల్లోనే పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు నేలకొండపల్లి బౌద్ధ ఆరామాల వద్దకు జపాన్ లాంటి దేశాల నుంచి బుద్ధిష్టులను ఆహ్వానించాలన్నారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు వచ్చి స్థానికంగా ఆదాయం పెరిగి యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. హైదరాబాద్ సాఫ్ట్వేర్ కు కేంద్రం. ఆ ఉద్యోగులు నెలకు ఒకసారి సెలవు దొరికితే ప్రశాంతంగా గడిపేందుకు అడవుల్లో ట్రిక్కింగ్, వాకింగ్ ట్రాక్, రిసార్ట్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. వారానికి లేదా నెలకు ఒకసారి ఆటవిడుపు కోసం ఈ పర్యాటక ప్రాంతాలు ఉపయోగపడతాయన్నారు. ఆటవిడుపుతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తే పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంత్రి జూపల్లి నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగం దేదీప్యమానంగా వెలుగుందుతుందన్నారు.

## 8 నెలల్లోనే ఎందుకీ వ్యవసాయ విధ్వంసం?



హైదరాబాద్ : తెలంగాణలో ఈ ఏడాది 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గడంపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలోనే వ్యవసాయానికి ఎందుకింత గడ్డుకాలమని 'ఎక్స్'లో ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలన సాగుకు స్వర్ణయుగమైతే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సాగు విస్తీర్ణం ఒకసారిగా ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గటం ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలో దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో 8 నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. %ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. సీఎం మాటలు కోటలు దాటుతు న్నా చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకొనే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీళ్లు మళ్లించే తెలివి లేదు. ఒక మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసానే లేదు' అని పేర్కొన్నారు. నిన్న వ్యవసాయానికి కరెంట్ కట్ చేశారు. నేడు రుణమాఫీలో రైతుల సంఖ్య కట్ చేశారు. సాగయ్యే భూమి విస్తీర్ణాన్ని కూడా కట్ చేసే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్యపెట్టి.. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ ఏర్పడిందని ఆరోపించారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించాలి: మంత్రి సీతక్క




– అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో సోమవారం జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క పారిశుద్ధ్యం పై సంబంధిత అధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సాధించాలనీ, వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి జిల్లాను ఆదర్శ జిల్లా గా తీర్చిదిద్దాలని అన్నారు. స్వచ్ఛధనం పచ్చదనం ప్రత్యేక 5 రోజుల కార్యక్రమంలో చేపట్టిన పారిశుద్ధ్య పనుల ప్రగతి పై సమీక్షించుకుని ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియ గా కొనసాగాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై, వరదలు విష జ్వరాలు హాస్టల్స్ స్కూల్ లలో సమస్యలు, మిషన్ భగీరథ ,వైద్యం మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడి కేంద్రాల పై మంత్రి సమీక్షించారు. మహిళ శిశు సంక్షేమ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం, గుడ్లు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. పట్టణాలలో గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి, వ్యాధులు రాకుండా చూడాలని అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమం నిరంతర ప్రక్రియ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని స్వచ్ఛదనం పచ్చదనం ప్రతీ నెల జరగాలని, డెంగ్యూ , మలేరియా, వ్యాధులు దోమలు, ఈగలు రాకుండా గ్రామాల్లో పట్టణాలలో అవగాహన కల్పించాలని, మున్సిపాలిటీలలో మార్కెట్ ఏరియా దుకాణాలలో తదితర ఏరియాలలో పారిశుధ్యం పై చర్యలు చేపట్టాలని ముఖ్యంగా తాగునీరు పై శ్రద్ధ వహించి సంపు , ట్యాంక్ లను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని అన్నారు. అధికారులు మార్నింగ్ వాక్ వెళ్లకుండా ప్రతిరోజు ఉదయం గ్రామాలలో పర్యటించి అక్కడి గ్రామపరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు, హాస్టల్స్ వార్డెన్ లతో మీటింగ్ ఏర్పాటు చేయాలని హాస్టల్స్ లో స్ప్రే చేయడం పరిసరాలు శుభ్రంగా ఉంచడం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పాములు, తెళ్ళు రాకుండా, చుట్టుపక్కల శుభ్రం చేయించుకోవాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లాను ప్రగతిపథంలో నిలుపుతూ ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు.

# తుంగ భద్రమేనా...

**కర్నూలు :** ఎగువ కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. జలాశయంలోని 19వ గేటు వరద ప్రవాహానికి చైన్ లింకు తెగి కొట్టుకు పోయింది. దీంతో జలాశయంలోని నీరు లక్ష క్యూసెక్కులకుపైగా నదిలోకి వెళ్తుంది. తుంగభద్ర జలాశయం గేటు కొట్టుకుపోవడంతో అసలు తుంగభద్ర జలాశయం ఇతర గేట్ల పరిస్థితి ఎలా ఉంది. గేటు కొట్టుకపోవడానికి నిర్వహణ లోపమా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని అధికారులు సమీక్షిస్తున్నారు. తుంగభద్ర జలాశయం లోకి ఎగువ కర్ణాటకలో ముందస్తుగా కురుస్తున్న భారీగా వరద నీరు చేరింది. జలాశయం కెపాసిటీ 105 టీఎంసీలు. ఇప్పటికే జలాశయంలో వరద ప్రవాహానికి 105 టీఎంసీల నీరు చేరింది. ఎగువన వర్షాలకు వరద నీరు వస్తుండడంతో 33 గేట్లు ఉన్న తుంగభద్ర జలాశయం 29 గేట్ల ద్వారా నీటిని నదిలోకి డ్యాం అధికారులు విడుదల చేస్తున్నారు. ఇదే సమయంలో గత శనివారం అర్ధరాత్రి గేట్లు ఎత్తుతున్న టైంలో 19వ గేటు వరద ప్రవాహానికి కొట్టుకపోయింది. తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకుపోవడంలో ఎవరి తప్పిదం ఉంది అన్న కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. నాన్ రైనీ సీజన్లో డ్యాం నిర్వహణను సరిగా జరిగిందా లేదా అని ఆరా తీస్తున్నారు. అసలు అప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారులు తీసుకున్నారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. డ్యాం భద్రత గేట్ల మెయింటెనెన్స్ గ్రీస్ చైన్స్ ఇలాంటివన్నీ కూడా అధికారులు దగ్గరుండి పరిరక్షించాల్సి ఉంది. డ్యాం అధికారులు మాత్రం ఈ ఏడాది కూడా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నారు. చైన్లకు గ్రీసు పూయడం ఇతర నిర్వహణ పనులు చేసినట్లు పేర్కొంటున్నారు. అయితే వర్షాకాలం ముందు డ్యామ్‌ను పరిశీలించి జాతీయ డ్యామ్‌లా బద్రతసంస్థకు అంత సవ్యంగానే ఉన్నట్లు చెప్పిన నివేదికను అధికారులు చూపిస్తున్నారు. డామ్ నిర్వహణ పనులు సవ్యంగా జరిగే ఉంటే డ్యాంలోని 19వ డేటు ఎందుకు కొట్టుకుపోయింది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా డ్యాం నిర్మాణం చేపట్టడంలో గేట్లు ప్రధాన భూమిక పోషిస్తాయి. నీటి నిల్వను అడ్డుకునేందుకు నీటిని దిగువకు వదలడానికి



డ్యామ్ గేట్లను ఏర్పాటు చేస్తారు. డ్యామ్ నిర్మాణాన్ని డాం కెపాసిటీని బట్టి డ్యామ్ గేట్లను ఏర్పాటు చేస్తారు. అయితే ఇందుకు సంబంధించి ఒక్కొక్క గేటు సుమారు 40 టన్నుల బరువు ఉంటుంది. ఒక్కొక్క గేటు జీవితకాలం 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంటుంది. తుంగభద్ర జలాశయంలో మాత్రం డ్యాం నిర్మాణం చేపట్టడం నుంచి ఇప్పటివరకు అవే గేట్లు వాడుతున్నారు ఇప్పటివరకు సుమారుగా అంటే 69 ఏళ్లుగా తుంగభద్ర జలాశయంలో అవే గేట్లను వాడుతున్నారు. ఎక్కడైనా డ్యాంల నిర్మాణం చేపడుతున్నప్పుడు డ్యాం గేటు కొట్టుకుపోయినప్పుడు స్టాప్ లాక్ సిస్టంను అధికారులు ఏర్పాటు చేస్తారు. తుంగభద్ర జలాశయం నిర్మాణం చేపడుతున్న సమయంలో స్టాప్ లాక్ సిస్టం లేకపోవడంతోనే నీటిని అడ్డుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా తుంగభద్ర జలాశయం 69 సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టారు. అప్పట్లో స్టాప్ లాక్ సిస్టం లేకుండానే డ్యాం నిర్మాణం చేపట్టారు. కేవలం చైన్ లింకు ద్వారానే గేట్లను ఆపరేట్ చేసే పరిస్థితి ఇక్కడ ఉంది. నాలుగేళ్ల క్రితం కేంద్ర జల సంఘం తుంగభద్ర డ్యామ్ ను పరిశీలించంది స్టాప్ లాక్ గేట్లు ఏర్పాటు లేదా ఏదైనా ప్రత్యాన్యయం చూడాలని సూచించింది. లేకుంటే డ్యామ్‌కే నష్టమని సిడబ్ల్యుసి చెప్పిందని ఎలా ఉండాలో సూచించలేదని ఒక సీనియర్ ఇంజనీర్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక గేట్లను అమర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే 19వ గేటు దగ్గర పనులను చురుకుగా చేస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొంత పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. తాత్కాలిక గేటును పెట్టేందుకు ప్రోసాహళ్లిలోని హిందుస్థాన్ ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థ ప్రాథమికంగా పనులు ప్రారంభించింది. తాత్కాలిక గేటు ఏర్పాటుకు మరో రెండు మూడు రోజులు సమయం పట్టేలా ఉందని అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయి గేట్లు ఏర్పాటు చేయాలంటే డ్యాం లోని 60 టీఎంసీ నీరు బయటకు వెళ్లేంతవరకు ఏర్పాటు చేయలేమని అంటున్నారు.

# నెక్స్ట్ లిస్ట్‌లో అనిల్

**అదిలాబాద్ :** కారు దిగేస్తున్న ఎమ్మెల్యేల సరసన చేరేందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తహతహ లాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బోథ్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన అనిల్ జాదవ్?. అధికార పార్టీ నేతలతో పోటీపడుతూ? ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారని.. గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా? తాజా ఎపిసోడ్‌తో ఆ ప్రచారం నిజమని నమ్మాల్సి వస్తోందంటున్నారు పరిశీలకులు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్యేల్లో నెక్స్ట్ అనిల్ జాదవ్ ఉన్నారనే ప్రచారం ఊపందుకుంది.డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క? గత బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పరిధిలోని పిప్రి గ్రామంలో పర్యటించారు. సరిగ్గా ఏడాదిన్నర క్రితం అంటే గతేడాది మార్చి 16న ఇదే గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ప్రారంభించారు భట్టి. సీఎల్పీ నేత హోదాలో నాడు పాదయాత్ర చేసిన భట్టి?. తమ పార్టీ అధికారంలోకి వస్తే పిప్రి గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీలను అమలు చేయడంలో భాగంగా గత బుధవారం పిప్రిలో పర్యటించారు భట్టి. ఐతే ఈ సభలో కాంగ్రెస్ నేతలతో పోటీపడుతూ మరీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్?. ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేలా మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదే ఇప్పుడు అనేక ఊహాగానాలకు తెరలేపింది.ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన డిప్యూటీ సీఎం భట్టి సభకు ఆదిలాబాద్ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. వీరిలో ఇద్దరు బీఆర్ఎస్, ఒకరు బీజేపీ ఎమ్మెల్యే ఉండగా, మిగిలిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన వారు. ఐతే బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెలిపాడ్ వద్దే భట్టిని కలిసి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసలు అటువైపే చూడలేదు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ ఇద్దరిలో అనిల్ జాదవ్ హాజరే చర్చకు దారితీసింది. డిప్యూటీ సీఎం సభకు భారీ అనుచరగణంతో కలిసి వచ్చిన అనిల్

## జిన్నారంలో హర్ ఘర్ తిరంగా



**వాస్తవ నేస్తం:జిన్నారం:** మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మండల బీజేవైఎం అధ్యక్షులు ఎల్లన్న గారి ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాలను చేతులు కట్టుకొని ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి, నాయలులు దోమడుగు రమేష్, ప్రధాన కార్యదర్శి మద్దూరి రాజు, ఉపాధ్యక్షులు పూడూరి సుధాకర్, బూత్ అధ్యక్షులు లడ్డు కొండరాజు, ఆకుల రాము, మహేష్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పలనాటి శ్రీను, మహేష్ కర్ణాకర్, సాయి, వీరేష్, చారి, అశోక్, సీత, రాజు ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ప్రజావాణిలో సీపీఎం దరఖాస్తు



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రజా సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీ లపై ప్రజల నుండి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు అందులో గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంటువాడుకున్న వారికి ఉచితం. విద్యుత్తు వినియోగదారులు ప్రజాపాలన దరఖాస్తులు గృహజ్యోతి పథకం వద్ద టిక్ మార్కు కొట్టినను కొంతమంది పేర్లు కంప్యూటర్లో టిక్ మార్కు నమోదు కాకపోవటం వలన వారికి విద్యుత్ బిల్లులు వస్తున్నాయి వారిని ఆ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ వారు ఒత్తిడి చేస్తున్నారు. అర్హత ఉన్న వారికి జీరో బిల్లు వచ్చే విధంగాచూడాలని ఒక దరఖాస్తుని సమర్పించారు అలాగే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నను పాసు బుక్కు రద్దు కాలేదని కన్వర్షన్ అయిన భూముల పాసుబుక్స్ వెంటనేరద్దు చేయాలని మరో వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలకమిటీసభ్యులు గుగులోతు పంతు, తెల్లాకుల శ్రీనివాస్, శాఖసభ్యులు ఉప్పర శ్రీను, గద్దె రామారావు పాల్గొన్నారు

## నెమలి కూరతో బుక్కైన యూ ట్యూబర్

**కరీంనగర్ :** సంప్రదాయ వంటకాలపై వీడియోలు చేస్తూ యూట్యూబ్‌లో పెట్టే ఓ వ్యక్తి ఇప్పుడు జైలు పాలయ్యాడు. జాతీయ పక్షి నెమలి కూర పేరుతో వంటకాన్ని వండి యూట్యూబ్‌లో పెట్టడంతో సమస్యల్లో చిక్కుకున్నాడు. దాన్ని చూసిన పలువురు నెటిజన్లు పోలీసులకు, యూట్యూబ్‌కు ఫిర్యాదు చేయడంతో చర్యలు తీసుకున్నారు. ఆయన్ని పోలీసులు అరెస్టు చేస్తే, ఆ వీడియోను యూట్యూబ్ వాళ్లు డిలీట్ చేశారు. సిరిసిల్లకు చెందిన ప్రణయ్‌కుమార్ అనే వ్యక్తి తన ఇంటి వద్దే సంప్రదాయపద్దతిలో వంటలు చేస్తూ యూట్యూబ్‌లో పెడుతుంటారు. ఆయనకు 277ఐ సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఆయన చేసిన వీడియోలు బాగానే వైరల్ అవుతుంటాయి. కొత్త కొత్త వంటకాలు ట్రై చేయలన్న ఆలోచన ఇప్పుడు ఆయన్ని జైలు పాలు చేసింది. జాతీయ పక్షి నెమలి వంటకం పేరుతో ప్రణయ్ పెట్టిన వీడియో సమస్యలు తెచ్చి పెట్టింది. సంప్రదాయపద్దతిలో నెమలి కూర ఎలా వండాలో చూడండి ఫ్రెండ్స్ అంటూ శనివారం ఓ వీడియోను ఆయన యూట్యూబ్‌లో పెట్టారు. ట్రెడిషనల్ పీకాక్ కర్రీ రెసిపీ అన్న పేరుతో వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు ప్రణయ్. దీన్ని గమనించిన జంతు ప్రేమికులు భగ్గుమన్నారు. ప్రణయ్ ఇలా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. యూట్యూబ్ గైడ్‌లైన్స్ ప్రకారం ఇది సరికాదని మరికొందరు యూట్యూబ్‌కు రిపోర్ట్ చేశారు. స్పందించిన యూట్యూబ్ ఆ వీడియోను తొలగించింది. నెమలి కూర పేరుతో వీడియో చేయక ముందే ప్రణయ్ చాలా నిషేధిత జంతువుల కూరలను కూడా వండి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ నెమలి ఇష్యూ వచ్చిన తర్వాత చూస్తే అలాంటివి చాలా గుర్తించారు నెటిజన్లు. అంతే వాటిని వెంటనే తొలిగించాలని యూట్యూబ్‌కు ఫిర్యాదు చేయడంతో వాటన్నింటినీ యూట్యూబ్ తొలగించింది. అలాంటి వాటిలో అడవి పంది మాంసం వంటకం కూడా ఉంది. వన్యప్రాణులను, జాతీయ పక్షులు, జంతువులను చంపడం నేరం. ప్రణయ్ మాత్రం వాటిని చంపడమే కాదు.. వాటి మాంసాన్ని ఎలా వండాలో చూపించే వీడియోలను కూడా అప్‌లోడ్ చేయడం ఇప్పుడు వివాదం మరింత ముదురు?తంది. జంతు ప్రేమికులు ఫిర్యాదు మేరకు ప్రణయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నెమలి కూర పేరు వండిన వంటకాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఆయనపై చర్యలు తీసుకోనున్నారు.

## మహిళలపై కామెంట్స్ చేస్తే తాట తీస్తాం

## వేణుస్వామిపై ఫిర్యాదులు

**హైదరాబాద్ :** హిళలను కించ పరిచి అదే కామెడీ, డార్క్ కామెడీ అంటూ కంటెంట్ క్రియేట్ చేసే వారికి, ఇన్ ఫ్లూయన్సర్లకు తెలంగాణ మహిళా కమిషన్ స్పష్టమైన సూచనలతో హెచ్చరికలు జారీ చేసింది. ప్రాథమిక హక్కుల్లో వాక్ స్వాతంత్ర్యం ఉంది కానీ.. దానికి కొన్ని పరిమితుల్ని రాజ్యాంగంలో పెట్టిందని తెలంగాణ మహిళా కమిషన్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చాలా మంది కంటెంట్ క్రియేటర్లు హద్దులు దాటిపోతున్నారని గుర్తు చేసింది. తండ్రీ, బిడ్డల విషయంలో ఇటీవల కొంత మంది చేసిన తరహా వీడియోలు ఏ మాత్రం క్షమించేవి కావని అందుకే.. . కంటెంట్ క్రియేటర్లకు.. ఇన్ ఫ్లూయన్సర్లకు.. నిబంధనలు జారీ చేస్తున్నామని తెలిపారు. పబ్లిక్ ఆర్డర్, కనీస హుందాతనం, నైతికత అనేవి మొదటగా కంటెంట్ క్రియేటర్లు, ఇన్ ఫ్లూయన్సర్లుగా మొదటగా చూసుకోవాల్సిన అంశం. ముఖ్యంగా మహిళాలకు సంబంధించిన ఎలాంటి చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్ ఉండకూడదు. ఒక వేళ అలా ఉంటే మహిళా కమిషన్‌కు చర్యలు తీసుకునే అధికారం ఉంటుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com